

సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి: ఆర్డీవో

పాచిపెంట, జూన్ 29 : ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా కార్డుదారులకు సక్రమంగా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని ఆర్డీవో హేమలత ఆదేశించారు. శనివారం పాచిపెంటలో పౌర సరఫరాల సంస్థ గోదామును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు, సరుకుల నిల్వలను పరిశీలించారు. ఐసీడీఎస్, జీసీసీ, సివిల్ సప్లయిస్‌కు చెందిన సరుకులను లెక్కించారు. 23 సివిల్ సప్లయిస్ పాయింట్లకు గాను 21 పాయింట్లుకు రేషన్ పంపించామని, మిగిలిన రెండింటికి తరలించాల్సి ఉందని గొడౌన్ సూపరింటెండెంట్ పైడిరాజు తెలిపారు. మండలంలో 11 జీసీసీ, 12 సివిల్ సప్లయిస్ డిపోలు ఉన్నాయన్నారు.

ఆరు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్

- గుమడ వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై లారీ బోల్తా
- ఎక్కడికక్కడే నిలిచిన వాహనాలు
- ఉదయం 11 గంటల తర్వాత కొనసాగిన రాకపోకలు
- ఊపిరిపీల్చుకున్న వాహనదారులు, ప్రయాణికులు
- ఈ మార్గంలో అడుగుకో గొయ్యి.. తరచూ ప్రమాదాలు
- ఐదేళ్లూ పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- నూతన ప్రభుత్వం స్పందించాలని ప్రజల విన్నపం

కొమరాడ, జూన్ 29: పార్వతీపురం నుంచి ఒడిశా రాష్ట్రం రాయగడ వైపు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో గుమడ గ్రామం వద్ద శనివారం ఓ లారీ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ సుమారు ఆరు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. కొమరాడ మండలం గుమడ గ్రామం వద్ద అంతర్రాష్ట్ర రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యిలో పార్వతీపురం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న లారీ ఉదయం 4.30 గంటల సమయంలో దిగబడి బోల్తా పడింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఏపీతో పాటు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వాహనాలు రోడ్డుకిరువైపులా బారులుదీరాయి. విషయం తెలుసుకున్న కొమరాడ ఎస్ఐ నీలకంఠం తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బోల్తా పడిన లారీని క్రేన్ సహాయంతో పక్కకు తీశారు. దీంతో ఉదయం 11 గంటల తర్వాత యథావిధిగా వాహన రాకపోకలు సాగాయి. వాహనదారులు, ప్రయాణికులు హమ్మయ్యా.. అంటూ ఊపిరిపీల్చుకున్నారు. తరచూ ఈ మార్గంలో ఇలా జరుగుతున్నా.. గత వైసీపీ సర్కారు స్పందించలేదు. జిల్లా పరిధిలో అంతర్రాష్ట్ర రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. రోడ్డు నిర్వహణను సైతం గాలికొదిలేసింది. ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా మరమ్మతు పనులు నిర్వహించ లేదు. దీంతో దారి పొడవునా భారీ గోతులతో నిండిన ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనదారులు పట్టుమని కిలోమీటరు కూడా సాఫీగా ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు కురిసే సమయంలో అయితే గోతుల్లో నీరు చేరడంతో రోడ్డు ఎక్కడుందోనని వెతుక్కోవల్సి వస్తోంది. దీంతో వాహనాలు గుంతల్లో దిగబడుతున్నాయి. ద్విచక్రవాహనదారులైతే గాయాలపాలవుతున్నారు. మొత్తంగా పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా.. ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్ట సాధ్యంగా మారింది. నూతన ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



నిలిచిపోయిన వాహనాలు


అంతర్రాష్ట్ర రహదారిలో బోల్తా పడిన లారీ

నిబంధనలకు 'బంక్'!

- దయనీయంగా పెట్రోలు బంకుల నిర్వహణ
- టైరు గాలి మిషీన్, మరుగుదొడ్లు, తాగునీరు లేని దుస్థితి
- వ్యాపారమే పరమావధిగా యాజమాన్యాల తీరు

(విజయనగరం రింగురోడ్డు)

పెట్రోల్ బంకుల్లో టైర్లకు గాలి కొట్టిద్దామంటే అవకాశం ఉండదు.. దాహం వేస్తే తాగునీరు దొరకదు.. మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదు. పెట్రోల్, డీజిల్ కొలతలు సక్రమంగా ఉన్నాయంటే అదీ అనుమానమే. ఎంతోమంది వాహనదారులు అక్కడి కొలతలపై ఫిర్యాదులు చేస్తున్నారు. పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి. ఎక్కడా ఇస్తున్న దాఖలాలు లేవు. ఇలా ఉమ్మడి జిల్లాలో పెట్రోల్ బంకుల నిర్వహణ అధ్వానంగా ఉంది. నిబంధనలను వారు ఏమాత్రం ఖాతరు చేయడం లేదు.

ఉమ్మడి జిల్లాలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాల సంఖ్య కూడా ఎక్కువే. ఈ పరిస్థితుల్లో పెట్రోలు, డీజిల్ వ్యాపారం విస్తృతంగా సాగుతోంది. దీంతో భారీగా పెట్రోలు, డీజిల్ పోసే బంకులు పెరిగాయి. వ్యాపారం విస్తృతం కావడంతో పెట్రోలు, డీజిల్ సరఫరా చేసే కంపెనీలు సైతం డీలర్లకు ఆకర్షణీయమైన కమీషన్ ఇస్తూ బంకుల సంఖ్యను పెంచుతూ వస్తున్నాయి. అయితే బంకుల్లో నాణ్యత, సౌకర్యాలు ప్రశ్నార్థకంగా మారాయి. నాణ్యత, సౌకర్యాలు తనిఖీ చేయాల్సిన సంబంధిత శాఖలైన పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు, రెవెన్యూ, విజిలెన్సు తదితర విభాగాల అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి. తనిఖీకి వెళ్లినా ఆ బంకులకు ముందే సమాచారం అందిపోతోంది. దీంతో అప్రమత్తమైపోతున్నారు. వారొచ్చి వెళ్లాక మళ్లీ మామూలే.

ఇలా ఉండాలి

- పెట్రోలు బంకుల్లో 10 వేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600 వెచ్చించాలి. నెలకు రూ.18 వేలు మరుగుదొడ్లకు, తాగునీరు, ఇతర సౌకర్యాల కల్పనకు ఖర్చు చేయాలి.
- వినియోగదారుల టైర్లలో గాలి తగ్గి బంకు వద్దకు వస్తే గాలి నింపే యంత్రాలు పనిచేయడం లేదని అక్కడి సిబ్బంది నిర్లక్ష్య సమాధానం చెబుతున్నారు. నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వాహనాలకు గాలి నింపే యంత్రాలు ఏర్పాటు చేయాలి. నిత్యం పనిచేయాలి.
- దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహన చోదకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు ఉండాలి. ఎక్కడా ఏర్పాటు చేయడం లేదు. ఒకవేళ ఉన్నా తాళాలు వేసి కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల అవి తెరచి ఉన్నా అపరిశుభ్రమే.

ఇలా ఫిర్యాదు చేయాలి

బంకుల్లో సౌకర్యాలు లేకపోతే సెంట్రలైజ్డు గ్రీవెన్స్ అండ్ మోనటరింగ్ సిస్టమ్ పోర్టల్ అయిన పీజీపోర్టల్.జీవోవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా పౌరసరఫరాలు, తూనికలు, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.



కనీస ప్రమాణాలు ఇలా..

- ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిస్టర్ ఉండాలి. వాహనదారులు అందులో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలి.
- ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. తాగేందుకు నీరు అందించాలి.
- పెట్రోలు నాణ్యతా ప్రమాణాలు పరీక్షించడానికి ఫిల్టర్ పేపర్లు వినియోగదారులకు ఇవ్వాలి..
- ప్రతి బంకులో సంస్థ వివరాలతో పాటు యాజమాని పేరు కన్పించేలా బోర్డు ఏర్పాటు చేసి మొబైల్ నెంబర్లు బోర్డుపై రాయాలి.

తనిఖీలు నిర్వహిస్తున్నాం

పెట్రోలు బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వాటిపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తున్నాం. లోపాలు గుర్తిస్తే ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు.

\- బి.మధుసూదనరెడ్డి, తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్, విజయనగరం

ఎదురుచూపు

- సీసీఆర్ కార్డుల కోసం కౌలు రైతుల నిరీక్షణ

విజయనగరం, కలెక్టరేట్, జూన్ 29: ఉమ్మడి జిల్లాలో పంటసాగు హక్కు పత్రాలు (సీసీఆర్-క్రాప్ కల్టివేటర్ రైట్స్) కోసం కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్ వచ్చేయడంతో సీసీఆర్ కార్డులు ఉంటే మరింత ధీమాగా సాగు చేసుకుంటారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు పొందాలన్నా అవి ఉండాల్సిందే. భూములను కౌలుకు తీసుకున్న రైతులకు ప్రభుత్వం ఏటా ఖరీఫ్ సీజన్‌కు ముందు సీసీఆర్ కార్డులను అందజేస్తుంటుంది. ఇందుకోసం గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి అర్హత గల రైతులను కార్డుల కోసం ఎంపిక చేస్తారు. ఈ ఏడాది దీనికి సంబంధించిన ప్రక్రియ మొదలు కాకపోవడంతో భూమిని కౌలుకు తీసుకున్న రైతులు కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

'మన్యం' జిల్లాలో సుమారు 25 వేల మంది కౌలు రైతులు ఉన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు సంబంధిత భూ యజమానుల నుంచి భూములు కౌలుకు తీసుకున్నారు. వారి మధ్య ఉన్న పరిచయాల వల్ల నోటిమాటగా ఒప్పందం చేసుకుని సాగు చేసుకుంటున్నారు. అయితే సీసీఆర్ కార్డు ఉంటేనే పూర్తిస్థాయి ధీమా ఉంటుంది. గత ఏడాది ఉమ్మడి జిల్లాలో చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే రుణాలు పంపిణీ చేశారు. కౌలు రైతులకు రుణాల మంజూరులో బ్యాంకులు చొరవగా ఉండడం లేదు. దీంతో కైలు రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండడం లేదు. కొన్నిచోట్ల కౌలుకు ఇచ్చిన భూస్వాములు కూడా రుణాలు తీసేసుకుంటున్నారు. దీంతో అవే భూములపై కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు అంగీకరించడం లేదు. ఈసారి అయినా సీసీఆర్ కార్డులు పొందిన రైతులకు తప్పకుండా రుణాలు మంజూరు చేయాలని వారంతా కోరుతున్నారు. దీనిపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్‌పాల్‌ను వివరణ కోరాగా.. ఈ ఏడాది 11,600 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు ఇస్తామన్నారు. గత ఏడాది 9,973 మందికి కార్డులు ఇచ్చామని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రతిపాదనలు పంపించండి: కలెక్టర్

పార్వతీపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తక్షణమే వాటి కోసం సమగ్ర ప్రతిపాద నలను అందించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వంతో కలిసి సహకారం అందించేందుకు ఎన్‌పీసీఐఎల్ పరిశ్రమ ముందుకొచ్చిందన్నారు. జిల్లా పరిధిలోని ప్రజలకు అత్యంత మేలు జరిగే మౌలిక సదుపాయాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. గిరిజన గర్భిణుల వసతిగృహం, బ్లడ్ కంపోనెంట్ యూనిట్, రక్త పరీక్షల పరికరాలను ఏర్పాటు చేయాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారిణి వాగ్దేవి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ అధికారులు, ఎన్‌పీసీఎల్ పరిశ్రమ చీఫ్ ఇంజనీర్ ప్రసాద్ తదితరులున్నారు.

వరహాల గెడ్డలో ఆక్రమణల తొలగింపు

పార్వతీపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్: పట్టణంలోని వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంలోని ఆక్రమణలను అధికారులు తొలగించారు. గెడ్డలో ఆక్రమణల విషయంపై ఫిర్యాదులు రావడంతో శనివారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డుల ప్రకారం గెడ్డ హద్దులను నిర్ణయించి వెంటనే ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కనకారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలను ఆక్రమిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులతోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టలని, లే అవుట్‌లు వేసుకోవాలని సూచించారు.



కొండల్లో ఏనుగుల సంచారం



సీతంపేట: చిన్నబగ్గ మర్రిపాడు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న ఉసిరిక పాడు, రంగంవలస కొండల్లో నాలుగు ఏనుగులు సంచరిస్తున్నాయి. గిరిశిఖర ప్రాంతాల్లో వాటికి పుష్కలంగా ఆహారం లభించడంతో అవి అక్కడే తిష్టవేశాయి. అయితే వాటి వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముం దస్తు చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ బీట్ అధికారి తవిటినాయుడు శనివారం తెలిపారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో గజరాజులు తిరుగుతున్నాయని , ఎప్పటికప్పుడు వాటి కదలికలను ట్రాకర్స్ పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు.

రాజీ మార్గమే శ్రేయస్కరం


- జిల్లా న్యాయాధికారి సౌమ్య జోస్పిన్

పార్వతీపురం టౌన్, జూన్ 29 : రాజీ మార్గమే శ్రేయస్కరమని జిల్లా న్యాయాధికారి జె.సౌమ్య జోస్పిన్ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 127 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. వాటిల్లో ప్రోనోట్ కేసులు -7, విద్యాశాఖ పిటిషన్ ఒకటి, భూ తగాదా-4, సివిల్-12, ఐపీసీ-112, ఎన్ఐ యాక్టు-3, ఎక్సైజ్ మూడు కేసులున్నాయి. అనంతరం న్యాయాధికారి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ అనేది వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గమని తెలిపారు. న్యాయస్థానంలో వాజ్యానికి ముందు పెండింగ్‌లో ఉన్న వివాదాలు, కేసులను సామరస్యంగా పరిష్కరించుకునేలా చేయడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమన్నారు. కక్షిదారుల కోసమే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. రాజీ మార్గం వల్ల డబ్బు, సమయాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు లక్ష్మణ్‌రావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో జిల్లా న్యాయాధికారి తదితరులు


శిథిలావస్థకు చేరిన కిల్లాడ డీఆర్ డిపో భవనం


కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న కోదిశ డీఆర్ డిపో భవనం

ఇదీ ఐదేళ్ల నిర్లక్ష్యం

- శిథిలావస్థలోనే జీసీసీ డీఆర్ డిపోలు
- పట్టించుకోని గత వైసీపీ సర్కారు
- స్టాక్ నిల్వలపై ఎన్నో సందేహాలు

సీతంపేట: సీతంపేట మండల పరిధిలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ)ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఆర్ డిపోలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. గత వైసీపీ సర్కారు వాటిని పూర్తిగా పట్టించుకోలేదు. ఐదేళ్ల పాలనలో కనీసం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయలేదు. దీంతో అవి మరింత అధ్వానంగా మారాయి. ప్రస్తుతం వాటిల్లో స్టాక్ నిల్వలు ఎలా చేయాలో తెలియక సేల్స్‌మన్లు తలలు పట్టుకుంటున్నారు. డీఆర్ డిపోల ద్వారానే గిరిజనులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు ఇటీవల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రకటించారు. దీంతో సరుకులను డిపోలకు తరలించి గిరిజనులకు అందించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. కాగా జీసీసీ డీఆర్ డిపోల పరిస్థితి చూసి ఆందోళన చెందుతున్నారు. మండలంలో 23 డీఆర్ డిపోలకు 18వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు చేయడానికి కూడా వీలు లేకుండా మారాయి. వర్షపునీరు కారిపోగా, కనీసం స్టాక్ నిల్వలు ఉంచడానికి వీలులేని పరిస్థితి. దీంతో సేల్స్‌మన్లు ఇబ్బందులు పడుతున్నారు. వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించాల్సి ఉందని వారు తెలియజేస్తున్నారు. దీనిపై ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలాన్ని వివరణ కోరగా.. శిథిలావస్థకు చేరిన కొన్ని జీసీసీ డీఆర్ డిపోల మరమ్మతులకు అనుమతులు వచ్చాయన్నారు. కాంట్రాక్టర్లు ముందుకొస్తే.. పనులు చేయిస్తామని తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

అగ్రి డిప్లొమాలు



ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in

డా.వైఎస్సార్‌హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్‌ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్‌ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనొన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియా యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, టీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13
- **వెబ్‌సైట్:** www.uceou.edu

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా **ఇంటర్వ్యూ తేదీలు:** జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/soMebZfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు

మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో



అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.


'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే

పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టి ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉప



ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన ఆర్టిస్టుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను




తమన్నా

దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.



'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశా' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం రూరల్, జూన్ 29: లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి సాధ్యపడుతుందని, కక్షిదారులకు సత్వరన్యాయం అందుతుందని మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి సీహెచ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 129 కేసుల్ని పరిష్కరించారని కోర్టువర్గాలు తెలి పాయి. జూనియర్ న్యాయాధికారి కృష్ణసాయితేజ మాట్లాడుతూ అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టుఫీజును వాపస్ ఇస్తారన్నారు. ● రాజాం మండలం పొగిరి గ్రామానికి చెందిన ఓ జంట, రేగిడి మండలం పెద్దపుర్లి గ్రామానికి చెందిన ఓ జంట విడాకులకు నిర్ణయించుకుని కోర్టు మెట్లెక్కాయి. కాళ్లరిగేలా తిరిగినా ఎన్నాళ్లకీ పరిష్కారం దక్కలేదు. మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఈ రెండు జంటల సమస్యలు, ఇబ్బందులు, వారు పెట్టుకున్న కేసుల్ని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు, రాజాం సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పరిశీలించారు. జూనియర్ న్యాయాధికారి కృష్ణసాయితేజతో చర్చించారు. ఆ జంటలతోనూ పలుమార్లు చర్చించి ఒప్పించారు. లోక్‌అదాలత్‌లో ఆ రెండు జంటల కేసుల్ని పరిష్కరించారు. ఒకరిపై మరొకరు పెట్టుకున్న కేసుల్ని ఆ రెండు జంటలు విత్‌డ్రా చేసుకునేందుకు అంగీకరించాయి. దీంతో వాళ్ల జీవితాలు చక్కబడ్డాయి. ● **బొబ్బిలి:** స్థానిక కోర్టు సముదాయంలో శనివారం మండల న్యాయసేవా సమితి చైర్‌పర్సన్, సీనియర్ న్యాయాధికారి ఎస్.అరుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 169 కేసులు పరిష్కారమయ్యాయని కోర్టు అధికారులు తెలిపారు. ఈ అదాలత్‌లో జూనియర్ సివిల్‌జడ్జి ఎం.రోహిణిరావు, న్యాయవాదులు వై.షణ్ముఖరావు, ఎస్. ప్రేమలత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పీఎం. మురళీకుమార్, కె.సింహాచలం, జీజీకే శర్మ తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి ప్రాంగణంలో న్యాయమూర్తి, మండల న్యాయ సేవాక మిటీ చైర్మన్ సబ్బవరపు వాణి అధ్యక్షతన శనివారం నిర్వహించిన జాతీయ లోక్ ఆధాలత్‌లో 63 కేసులను పరిష్కరించారు. న్యాయవాదుల సంఘ అధ్య క్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసి క్యూటర్ పి.కేశవ తదితరులున్నారు. ● **కొత్తవలస:** రాజీకి వీలుపడే కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయాన్ని వృథా చేసుకునే అవసరం ఉండదని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జికోర్టు న్యాయమూర్తి డాక్టర్ ఎస్.విజయచందర్ అన్నారు. శనివారం కొత్తవలస కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్ కార్యక్రమానికి లోక్ అదాలత్‌లో భాగంగా 53 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ కార్యక్రమానికి హాజరైన పార్టీలకు న్యాయవాద సంఘం భోజన ఏర్పాటులు చేశారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీపీఎల్ దేవి ,డి.శ్రీనివాస్,గొడుగుల మహేంద్ర, కొత్తవలస, లక్కవరపుకోట,వేపాడ పోలీసు స్టేషన్‌లకు సంబంధించిన సిబ్బంది, కొత్తవలస ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **గజపతినగరం:** స్థానిక ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టులో ప్రధాన న్యాయాధి కారి బి.కనకలక్ష్మి శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్‌అదా లత్ ద్వారా 91 కేసులను పరిష్కరించినట్టు తెలిపారు. న్యాయవాదులు పాల్గొ న్నారు. ● **బొండపల్లి:** గజపతినగరంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మండలంలోని వివిధ కేసుల్లో నమోదైన 24 కేసులు పరిష్కారమైనట్టు ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. ● **చీపురుపల్లి:** చీపురుపల్లిలోని కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి వై.ప్రేమలత 50 కేసులను రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రెడ్డి రమణ, టీవీ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



రాజాం: మాట్లాడుతున్న న్యాయాధికారి ఆనంద్ శ్రీనివాస్


బొబ్బిలి: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి అరుణశ్రీ



చీపురుపల్లి: కేసుల్ని పరిష్కరిస్తున్న న్యాయాధికారి ప్రేమలత


గజపతినగరం: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి కనకలక్ష్మి


ఎస్.కోట: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి వాణి


కొత్తవలస: మాట్లాడుతున్న న్యాయాధికారి జయచందర్

పురుగు మందు తాగి ఒకరి ఆత్మహత్య

దత్తిరేజరు: పురుగు మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన పెదమానపురం పోలిసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెదకాదకు చెందిన నక్కేల గోపి (40) గతంలో బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయప డ్డాడు. అప్పుడు తగిలిన గాయాలకు, ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నాడు. అ బాధలను తట్టుకోలేక ఈ నెల 27న పురుగు మందు తాగి అత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు గుర్తించి విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మరణించాడని హెడ్ కానిస్టేబుల్ కాశి తెలిపారు. మృతుడికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం కురుపాం మండలం లండగొర్లి గ్రామానికి చెందిన భాను ద్విచక్ర వాహనంపై వేగంగా మద్యం మత్తులో గుమ్మలక్ష్మీపురం గ్రామానికి వస్తూ ఎల్విన్‌పేట కూడలి సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టబోయి రోడ్డుపక్కనే పడి పోయాడు. దీంతె యువకుడు కుడివైపు ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి కొంతమంది యువకులు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. యువకుని పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

సారా తరలింపు.. ముగ్గురిపై కేసు

సాలూరు: ఒడిసా నుంచి నాటు సారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని శనివారం కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ వాసునాయుడు తెలిపిన వివరాల ప్రకారం పెదపెంకి గ్రామానికి చెందిన గొర్లె సత్యనారాయణ, సుభద్ర గ్రామానికి చెందిన గొర్లె ఈశ్వరరావు, కొమరాడకు చెందిన గొర్లె పవన్ ఒడిశా రాష్ట్రం అలమండ నుంచి ద్విచక్ర వాహనంపై ఆరు క్యాన్‌లుతో 120 లీటర్ల సారా తరలిస్తుండగా మార్గమధ్యలో సాలూరులో చిన్నబజార్ జంక్షన్ వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధంకండి: కోళ్ల

లక్కవరపుకోట, జూన్ 29: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేదలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంపుచేశారని, వాటిని పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం కావాలని ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన 5 మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్ల పెంపు జరిగిందని వాటిని ఎటువంటి పొరపాటు జరగకుండా పేదలకు అందేటట్లు అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో 5 మండలా ఎంపీడీవోతో పాటు టీడీపీ నేతలు మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, తూర్పాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ల పంపిణీపై సమావేశమైన ఎమ్మెల్యే కోళ్ల

ఐటీఐలో మిగులు సీట్లకు దరఖాస్తులు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జూలై 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కంటకాపల్లి హైస్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి

కొత్తవలస, జూన్ 29 : మండలంలోని కంటకాపల్లిలో నున్న జడ్పీహైస్కూల్ విద్యార్థులకు శారదా కంపెనీ ప్రతినిధులు,వైజాగ్ నైట్స్‌లేడీస్ సర్కిల్ కలసి క్రీడా సామగ్రిని అంద చేశారు.బాల్ బాడ్మింటన్‌కు చెందిన బ్యాట్‌లు, బాల్స్, షటిల్ బ్యాడ్మింటన్ బ్యాట్‌లు, బాల్స్‌తో బాల్స్,వాలీబాల్స్, టెన్నికాయిట్,వాలీబాల్,బాల్‌బ్యాడింమంటన్, షటిల్ బ్యాడ్మింటన్ నెట్‌లను ప్రధానోపాధ్యాయుడు వి. అరుణ్ కుమార్‌కు అంద చేశారు.

జాబ్ మేళాకు 331 మంది హాజరు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శనివారం జరిగిన జాబ్‌మేళాకు 331 మంది హాజరయ్యారని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారని భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఆరు కంపెనీలు వారు ఈ జాబ్‌మేళా నిర్వహించగా ప్రతిభ గల అభ్యర్థులు 170 మందిని వివిధ కంపెనీలకు చెందిన యాజమాన్యం వారు తీసుకున్నారు. ఈ జాబ్ మేళాకు కన్వీనరు టి వి గిరి. అనంతరం కన్వీనరు టి వి గిరి మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యం నుండి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడినా సమాచారం అందించాలన్నారు. కంపెనీల యాజమాన్యం మెచ్చుకొనేలా కష్టపడి పనిచేసి రాజాం ప్రతిష్టను కాపాడాలని కోరారు.మంచి ప్రవర్తనతో మెలిగి గుర్తింపును తీసుకు రావాలన్నారు

మంత్రి లోకేశ్‌ను కలిసిన 96 డీఎస్సీ క్వాలిఫైడ్లు

రాజాం రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను 1996 డీఎస్సీ క్వాలిఫైడ్లు శనివారం ఉండవల్లిలో కలిసి వినతిపత్రం అందజేశారు. 1998 క్వాలిఫైడ్లు మాదిరిగా మాకు కూడా ఎం.టి.ఎస్. ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో పలుమార్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణతో పాటు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారావును కలిసి తమ వెతలు వినిపించినా పట్టించుకోలేదని, మాకు న్యాయం చేయలేదని లోకేశ్‌కు వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అయినా మాకు అవకాశం కల్పించి మమ్మల్ని ఆదుకోవాలని, మా వినతిని సానుభూతితో పరిశీలించాలని క్వాలిఫైడ్లు కోరారు.

సీఎంను కలిసిన గొంప కృష్ణ

శృంగవరపుకోట, జూన్ 29: అమరావతిలో శనివారం సీఎం నారాచంద్రబాబు నాయుడును శృంగవరపుకోట నియోజకవర్గంనకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్. ఎస్.కోట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యంలు ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు.


చంద్రబాబు నాయుడును కలిసిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ

గరివిడి పీహెచ్‌సీకి జాతీయ అవార్డు

గరివిడి: గరివిడి పీహెచ్‌సీని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ వారు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును జిల్లా వైద్యాధికారులకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేతులమీదుగా శనివారం ఢిల్లీలో అందజేశారు. రాష్ట్రంలో నాలుగు పీహెచ్‌సీలకు ఈ అవార్డు లభించింది. అందులో విజయనగరం జిల్లాకు చెందిన గరివిడి పీహెచ్‌సీకి అవార్డు రావడం పట్ల జిల్లా వైద్యాధికారులు, గరివిడి పీహెచ్‌సీ సిబ్బంది నుంచి హర్షం వ్యక్తం అవుతుంది.

డయేరియా వారోత్సవాలు

లక్కవరపుకోట: మండలంలో అన్ని గ్రామాల్లో రెండు నెలలపాటు డయేరియా వారోత్సవాలు జరగనున్నట్టు ఎంపీడీవో కే.రూపేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తిరిగి వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు అందజేయాలన్నారు. తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీసెంట్ నోటీసు ఇచ్చిన టీడీపీ కౌన్సిలర్లు

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీలో సాధారణ నిధుల నుంచి కోట్లాదిరూపాయలను వెచ్చిస్తుండడాన్ని టీడీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ డిసెంట్ నోటీసు ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు మాట్లాడుతూ సాధారణ నిధుల నుంచి కోట్లాది రూపాయలను విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ ఒక్క కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం పట్ల ప్రజల్లో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. దీనిపై చోడిగంజి రమేష్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదని ఇప్పుడు ఇలా అభ్యంతరం పెడితే ఎలా అని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో అభివృద్ధి పనులను ఇకనైనా చేపట్టాలని ఐదోవార్డు కౌన్సిలరు వెలగాడ హైమావతి డిమాండ్ చేశారు. పట్టణంలోని 31 వార్డుల్లో మొక్కల నిర్వహణ కోసం 34.96 లక్షలు, భోజరాజపురం వాటర్‌వర్క్స్‌లో మరమ్మతు పనులకు 4.90 లక్షలు, పైపులైను లీకేజీలు, పగుళ్ల అరికట్టుటకు గతంలో కేటాయించిన 13.50 లక్షల నుంచి 14.75 లక్షలకు, వీధిదీపాల నిర్వహణకు 9.80 లక్షలు నుంచి 11.75 లక్షల రూపాయలకు పెంచి కాంట్రాక్టరుకు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్‌లలో షాపుల గుడ్‌విల్ మొత్తాలను 50 శాతం తగ్గిస్తూ తీర్మానం చేశారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రత్యేకాధికారులు

విజయనగరం రూరల్: విజయనగరంలోని ఎనిమిది వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు నెలలు లేదా పాలకవర్గాలు నియమించేంత వరకూ వీరు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీకి మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఇక మిగిలిన ఏడు మార్కెట్ కమిటీలకు మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జామి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నామని.. దీనిని అర్హులైన వారు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో తిరుమల రావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

రేగిడి: కొత్త ప్రభుత్వం పెంచిన పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో శనివారం రేగిడి యునియన్ బ్యాంక్‌లో నగదు విత్‌డ్రాకు చర్యలు చేపడుతున్నారు. 25 సచివాలయాల్లో అన్నిరకాల పింఛన్లు మొత్తం 10,908 మందికి పంపిణీ చేయనున్నట్టు వెలుగు ఏపీఎం గోవిందరావు తెలిపారు. 1, 2 తేదీల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో శ్యామలా కుమారి తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

రామభద్రపురం: మామిడివలస గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నడుపూరి చిన్నంనాయుడు ఇటీవల మృతి చెందారు. అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, తెలుగుదేశం పార్టీ, తాను కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతినాయుడు, కనిమెరక శంకరరావు, వసంతుల వెంకటరావు, కనిమెరక వెంకటి, బలరాం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదితిని కలిసిన ఆర్టీసీ స్టేషన్ మేనేజరు

విజయనగరం రింగురోడ్డు: విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని శనివారం ఆమె నివాసంలో ఆర్టీసీ స్టేషన్ మేనేజరు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెదమజ్జి సత్యానారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విజయనగరం బస్ డిపోలో ప్రయాణికులు అందించే సేవలు గురించి వివరించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయనగరం బస్‌డిపోకి అదనంగా బస్సులు కేటాయించాలని కోరారు.

పూర్తి సమాచారం ఇవ్వండి

● పారిశుధ్య సమస్య లేకుండా చూడండి ● ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రింగురోడ్డు, జూన్ 29: నగరపాలక సంస్థలోని వివిధ విభాగాలకు సంబంధించి తనకు సమస్త సమాచారం అధికారులు అందజేయాలని విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చెప్పారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా శనివారం నగర పాలక సంస్థకు ఆమె వచ్చారు. ఆమెకు మేయర్ వీవీ లక్ష్మీ, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చి లయ యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె నగరపాలక సంస్థ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ ఎంఎం నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు తదితరుల ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆమె విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. రోడ్ల విస్తరణ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాల న్నారు. ఇంజినీరింగు విభాగంపై సమీక్ష నిర్వహించారు. చాలా ప్రాంతాల్లో ఎల్ ఈడీలు వెలగలేనట్టు తన దృష్టికి వచ్చిందని, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఆయా ఎల్ఈడీలు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులందరినీ పరిచయం చేసుకుని, ఆయా శాఖల ప్రగతిని ఆమె తీలుసుకున్నారు.


మాట్లాడుతున్న అదితి

ప్రజల రుణం తీర్చుకుంటా

● ఎమ్మెల్యే బేబీనాయన

ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణం

బొబ్బిలి: గతంలో తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు అనారోగ్యానికి గురై చనిపోతానని వైద్యులు నిర్ధారించారని, భగవంతుని ఆశీస్సులు, ప్రజల పూజల ఫలంతో ఇలా మీ అందరి ముందు ఉండగలిగానని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కెకె రంగారావు (బేబీనాయన) అన్నారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణా రావు అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేగా మంచి పనులు చేయడం ద్వారా ప్రజలందరి రుణం తీర్చుకుంటానన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి త్వరలో అన్ని శాఖల అధికారులు, కౌన్సిలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి.. శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు. పట్టణంలో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మినీ పైలట్ వాటర్ స్కీములను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. రోడ్ల విస్తరణకు నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని వెంకటమురళీకృష్ణ, మాజీ వైస్‌చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, టీడీపీ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు, వెలగాడ హైమావతి, కౌన్సిలరు రాంబార్కి శరత్‌బాబు తదితరులు బేబీనాయనను అభినందించారు. ● తొలిసారిగా మున్సిపాలిటీకి విచ్చేసిన బేబీనాయనకు పాలకవర్గంతో పాటు కమిషనర్ లాలం రామలక్ష్మి, మేనేజర్ బీఎండీ శివప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి శాలువలు కప్పి, స్వీట్లు తినిపించారు. టీడీపీ, వైసీపీ అనే తేడా లేకుండా అందరూ సాదరంగా ఆహ్వానించడం గమనార్హం.


ఎక్స్ అఫీషియో సభ్యునిగా ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

సీజనల్ వ్యాధుల నివారణకు పాటుపడండి

శృంగవరపుకోట, జూన్ 29: సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో సూర్యకళ సూచించారు. శనివారం శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిషత్, వైద్య ఆరోగ్య శాఖ, తాగునీటి శాఖ, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులను ఎదుర్కొనేందుకు సమయత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పంచాయతీలో పారిశుధ్య నివారణ సక్రమంగా జరపాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ కిరణ్ కుమార్, ఈవోపీఆర్డీ ఐ.వి లక్ష్మి, గ్రామీణ తాగునీటి శాఖ జేఈ సత్యకిశోర్ తదితరులున్నారు. మండల పరిధిలోని దబ్బగుంట గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.


ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఆర్డీవో

జిల్లా పోలీసు ఉద్యోగులకు వీడ్కోలు


పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, జూన్ 29: జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించిన నలుగురు ఎస్‌ఐలు, నలుగురు ఏఎస్‌ఐలు, ఏఆర్ హెచ్‌సీలు పదవీ విరమణ చేశారు. వీరిని ఎస్పీ దీపిక ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన సేవలను కొనియాడారు. వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఆస్మా పరహీన్, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, సీఐలు విజయానాథ్, నర్సింహమూర్తి, రాజశేఖర్, మురళి, ఆర్‌ఐలు గోపాల నాయుడు, భగవాన్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

విజయనగరం క్రైమ్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ వెంకట్రావు అన్నారు. శనివారం నగరంలోని అపెక్స్ జూనియర్ కళాశాలలో విముక్తి స్వచ్ఛంద సంస్థ సహకారంతో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ భార్గవ్, కాశీ ప్రసాద్, ఎన్.చంద్ర, ఎస్ఐ నవీన్ పడాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

స్టాఫ్‌నర్సులుగా అవకాశం కల్పించాలి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

విజయనగరం (ఆంధ్ర జ్యోతి), జూన్ 29: జిల్లా కేంద్రాసుపత్రిలో జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసుకున్న తమకు ఎంఆర్‌జీజీ ఆసుపత్రిలో స్టాఫ్‌నర్సులుగా అవకాశం కల్పించేందుకు కృషి చేయాలని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వారు కోరారు. ఈ మేరకు ఆయనను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నియామక ప్రక్రియ జరుగుతోందని... ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మండల పరిషత్ సమావేశానికి ఎమ్మెల్యే

● ఘన స్వాగతం పలికిన సభ్యులు

బొబ్బిలి, జూన్ 29: బొబ్బిలి మండలపరిషత్ సర్వసభ్యసమావేశానికి తొలిసారిగా ఎమ్మెల్యే హోదాలో హాజరైన ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) కు ఘనస్వాగతం లభించింది. ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన శనివారం సర్వసభ్యసమావేశం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మేళతాళాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ లక్ష్మితో ఆమె భర్త వేణుగోపాలనాయుడు, ఎంపీడీవో రవికుమార్ ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు సాదరంగా సమావేశపు హాలులోనికి తోడ్కొని వెళ్లి పూలమాలలతో ముంచెత్తారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాలలో పారిశుధ్య నిర్వహణను పగడ్బందీగా చేపట్టాలన్నారు. ఎంపీపీ లక్ష్మీవేణుగోపాలనాయుడు మాట్లాడుతూ మండలాభివృద్ధి కోసం అందరమూ కలిసికట్టుగా చేసేందుకు ఎమ్మెల్యే సహకరించాలని కోరారు.

● వ్యవసాయరంగానికి పెద్దఎత్తున సబ్సిడీ పథకాలను అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కృష్ణాపురంసర్పంచ్ గంట సింహాచలం కోరారు. పారాది కొత్త బ్రిడ్జిని నిర్మించడంలో జాప్యం చేశారని, కాజ్‌వే పేరుతో కోట్లాది రూపాయలను వృథా చేశారని మళ్లీ కొట్టుకుపోయే విధంగా దానికే మెరుగులు దిద్దడం ఏమిటని దిబ్బగుడ్డివలస ఎంపీటీసీ వెన్నెల నాగరాజు ప్రశ్నించారు.


● కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో రైతులు నష్టపోతున్నారని రంగరాయపురం సర్పంచ్ నారాయణరావు అన్నారు. గున్నతోట వలస -ఎం.బూర్జివలస రహదారిలో రైల్వే పనులు జరుగుతున్నాయని, ఆర్అండ్‌బి రోడ్లను ఆక్రమించి జరుగుతున్న పనులను అడ్డుకోవాలని ఆ గ్రామసర్పంచ్ సింగనా పల్లి ఈశ్వరరావు కోరారు. దీనిపై రైల్వే శాఖకు లేఖ రాశామని జేఈ రాజు తెలిపారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

● రైతులకు సకాలంలో విత్తనాలు అందించాలి

● జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూన్ 29: జిల్లాలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, డయేరియాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో స్థాయీ సంఘాల సమావేశం జరిగింది.. 1, 2, 3, 4, 7 వ స్థాయీ సంఘ సమావేశాలు జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, ఆ సంఘ చైర్‌పర్సన్ ఎస్.శాంతకుమారి, ఆరో స్థాయీ సంఘ చైర్మన్ కొరజన్ని సింహాచలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వ్యాధులు విజృంభించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మలేరియా వ్యాప్తి చెందే గిరిజన ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలను వెంటనే ప్రారంభించాలన్నారు. వర్షాలు సకాలంలో కురుస్తున్నందున రైతుల విత్తనాలకు, ఎరువులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టరు సురేష్‌బాబు, సీఈఓ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్న శ్రీను

జీతాలు ఇచ్చుకోలేని స్థితికి తీసుకొచ్చారు

● మంత్రి సంధ్యారాణి


తమ సమస్యలను మంత్రికి చెబుతున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు: 'ఒకప్పుడు సాలూరు అంటే జాతీయ స్థాయిలో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్న మున్సిపాల్టీ.. ఈ రోజు కార్మికులకు జీతాలు ఇచ్చుకోలేని దీనస్థితికి వచ్చిందంటే దీనికి కారణం ఎవరనేది మనమే ఆలోచించాలి' అని గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎక్స్ అఫీసియో మెంబర్ హోదాలో ఆమె హాజరయ్యారు. ముందుగా కార్యాలయం ఎదుట తమ జీతాలు, అలవెన్స్‌ల కోసం నిరసన చేస్తున్న మున్సిపల్ కార్మికులతో ఆమె మాట్లాడారు. తమ న్యాయమైన కోర్కెలు పరిష్కారం అయ్యేలా తాను చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. సమావేశ మందిరంలో ఆమెకు ఛైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు సాలూరు మున్సిపాల్టీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న మున్సిపాల్టీగా పేరు ఉందన్నారు. ఈ రోజు పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వటం లేదని, కార్యాలయం ముందు బైఠాయించటం అనేది చాలా దురదృష్టకరమని అన్నారు. గతంలో గవర్నర్ పర్యటనకు వచ్చేటప్పుడు పబ్లిక్ టాయిలెట్స్‌కు ఫ్లెక్సీలు అడ్డుపెట్టి దాచుకోవాల్సిన దుస్థితి మన మున్సిపాల్టీకి తీసుకుని వచ్చారన్నారు. ఇప్పటి నుంచి మున్సిపల్ పరిపాలన సక్రమంగా ఉండాలని ఆ విధంగా దృష్టి పెట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఎన్టీఆర్ పెన్షన్ పండుగ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది కలిసి ప్రతి పింఛన్‌దారుడికి పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

సాలూరు రూరల్: సాలూరు మండలం శివరాంపురం వద్ద ఉన్న వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును శనివారం సాలూరు రూరల్ పోలీసులు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. శివరాంపురం వేగావతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతున్నట్టు అందిన సమాచారం మేరకు సాలూరు ఎస్ఈబీ సీఐ వెంకటరావు శనివారం సిబ్బందితో దాడి చేసి, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. నిందితులు బూస నరేంద్ర, కనకల మణికంఠలను రూరల్ పోలీసులకు అప్పగించారు. ఇసుకతో ఉన్న రెండు ట్రాక్టర్లును సీజ్ చేసి, చోదకులపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ విలేకర్లకు తెలిపారు.

నిలకడగా నాగావళి


స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీరు విడుదల చేసిన దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలో నదీ ప్రవాహం నిలకడగా ఉంది. ఒడిశాతో పాటు ఈ ప్రాంతంతో కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా శుక్రవారం సాయంత్రం కొంతమేర వరద ప్రవాహం నదిలో చేరింది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు వరద నీటిని మళ్లించారు. శనివారం పైనుంచి సుమారు 1,500 క్యూసెక్కుల నీరు నదిలోకి చేరగా, దిగువకు 2,570 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకుగాను 104.37 మీటర్ల నిల్వ సామర్థ్యం నెలకొందని ప్రాజెక్టు డీఈ టి.రఘునాథనాయుడు, జేఈ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసిన పక్షంలో అధికంగా వరద ప్రవాహం వస్తే దిగువకు మళ్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని చెప్పారు. ప్రాజెక్టు ప్రాంతంలోనే అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. వర్షాల కారణంగా ఎడమ ప్రధాన కాలువకు, పాత కుడి కాలువకు సాగునీరు నిలుపుదల చేశామని, ప్రస్తుతం కుడి ప్రధాన కాలువ నుంచి 158 క్యూసెక్కుల నీరును సరఫరా చేస్తున్నామని వారు తెలియజేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన డొంకాడ


రామ్మోహన్‌నాయుడుని అభినందిస్తున్న డొంకాడ రామకృష్ణ తదితరులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/ జియ్యమ్మవలస: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును శనివారం శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో టీడీపీ అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. రామ్మోహన్‌ను శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. కురుపాం నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు ఇవ్వాలని కేంద్రమంత్రిని ఆయన కోరారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజలకు సేవలు చేయాలని నాయకులను కోరారు. పార్టీలో కష్టపడిన వారికి, వైసీపీ నుంచి సమస్యలు ఎదుర్కొన్న వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో డంగభద్ర పంచాయతీ సర్పంచ్ జోగి భుజంగరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీలో గురుకుల ఉపాధ్యాయ పోస్టులు మినహాయించాలి


సీతంపేట డీడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

సీతంపేట: మెగా డీఎస్సీలో 1,143 గిరిజన గురుకుల ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని కోరుతూ శనివారం జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ కార్యాలయం ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ మేరకు డీడీ అన్నదొరకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఎస్టీ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి మంజులవీణ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల పనితీరు మెరుగుపర్చుకోవడానికి సూచనలు చేశారు. ఆమె వెంట కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మ, లెక్చరర్లు, సిబ్బంది ఉన్నారు.

3న అమ్మవారి హుండీల లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి హుండీలను వచ్చే నెల 3న లెక్కించనున్నట్టు కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ శనివారం తెలిపారు. హుండీల లెక్కింపును జిల్లా దేవాదాయ, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. లెక్కింపులో అమ్మవారి భక్తులు, సేవకులు పాల్గొనవచ్చునని కోరారు.

విద్యార్థి నాయకుల ఎన్నిక

భామిని: స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థి నాయకులుగా ఎన్నికైన వారిని ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ప్రకటించారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో స్కూల్ కెప్టెన్‌గా శ్రీరామవంశీ, వైస్ కెప్టెన్‌గా కార్తీక్, స్పోర్ట్స్ కెప్టెన్‌గా పాలక కార్తీక్ ఎన్నికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కౌంటింగ్‌లో పాఠశాల అధ్యాపకులు బి.ముత్యాలు, నరసయ్య, ఆర్.సంతోష్‌కుమార్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ దృష్టికి సమస్యలు

గరుగుబిల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి వివిధ సమస్యలను తీసుకువెళ్లినట్లు అరకు తెలుగుదేశం పార్టీ రైతు విభాగం కార్యదర్శి కండేన బలరాంనాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవకతవకలు, అవినీతి చోటు చేసుకుందని మంత్రికి వివరించామన్నారు. కురుపాం నియోజకవర్గంలో తోయక జగదీశ్వరిని గెలిపించడంపై అభినందించారన్నారు. అక్కేన నారాయణరావు తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం

గరుగుబిల్లి: మండలంలో సోమవారం పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏవో ఎస్.అర్జునరావు తెలిపారు. శనివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో 25 పంచాయతీల్లో 8,376 మంది పింఛన్‌దారులు ఉన్నారని, వీరికి పెంచిన మొత్తాలతో రూ.5,39,11,500 అందించనున్నట్టు తెలిపారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలో 25 సచివాలయాల పరిధిలో 6,734 మంది పింఛనుదారులు ఉన్నారని ఎంపీడీవో జగదీష్ తెలిపారు. వీరందరికీ రూ.ఏడు వేల చొప్పున రూ.నాలుగు కోట్ల 61లక్షల 94 వేలు పంపిణీకి సిద్ధం చేశామన్నారు.

మాకు న్యాయం చేయండి

ఒడిశా

రాయగడ: తమకు న్యాయం చేయాలని కోరుతూ ఉర్లాంగ్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబీకులు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. వారి వివరాల మేరకు.. ఉర్లాంగ్ గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు గోపాల్ టక్రి, చతుర కొరొరియా, సుధేబ్ కొరకొరియాలు గత నెల 12న ఊరుబయట మద్యం తాగేందుకు వెళ్లారు. మద్యం తాగుతుండగా వారిలో వారికి మాట మాట పెరిగింది. దీంతో మద్యం మత్తులో చతుర, సుధేబ్ కలసి గోపాల్ టక్రిని హత్యచేశారు. అనంతరం మృతదేహాన్ని రోడ్డుపక్కన మామిడిచెట్టు వద్ద పడవేసి ఏమి తెలియనట్లు ఎవరింటికి వారు వెళిపోయారు. గోపాల్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతకగా మామిడి చెట్టువద్ద మృతదేహాన్ని కను గొన్నారు. 13వ తేదీ ఉదయం అంబోదల పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించిన పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. 20 రోజుల తర్వాత నిందితులను విడిచిపెట్టారు. నిందితులను శిక్షించకుండా ఎందుకు విడిచిపెట్టారని బాధితులు పోలీసులను ప్రశ్నించారు. వారే ఈ హత్య చేసినట్లుగా ఎలాంటి ఆధారాలు, సాక్ష్యాలు లేవని మీరేమైనా సాక్ష్యాలు చూపితే నిందితులపై తగు చర్యలు తీసుకుంటామని అంబోదల పోలీసులు బదులు చెప్పారు. దీంతో ఖిన్నులయిన బాధితులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి న్యాయం చేయమని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి

● రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే విజయచంద్ర ఆదేశం


లంచెల చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం రూరల్: బాలగొడబ పరిధిలో ఉన్న లంకెల చెరువు తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి వెంటనే వాటి యజమానులకు నోటీసులు అందించి తొలగించాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం లంకెల చెరువుతో పాటు ఇతర చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల విస్తీర్ణం, ఆక్రమణలకు గురైన చెరువు ప్రాంతాన్ని పరిశీలించి వెంటనే చెరువులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణతో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంతో చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని పూర్తిగా సరిదిద్దాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, బోను దేవి చంద్రమౌళి, కోరాడ నారాయణరావు, సిరిపురం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేతకు చర్యలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: గత ఐదేళ్లుగా ఫ్లైఓవర్‌పై ఎక్కడిపడితే అక్కడ గుంతలు ఉన్నప్పటికీ మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు కనీసం పట్టించుకోని పరిస్థితి ఉంది. గుంతలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను టీడీపీ నాయకులు ఇటీవల ఎమ్మెల్యే విజయచంద్ర దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే ఆయన స్పందించి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. దీనితో వాహనదారులతో పాటు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారితో పాటు టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కోరాడ నారాయణరావు, బోనుదేవి చంద్రమౌళి, జి.రవికుమార్, కోలా మధుసూదనరావు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

తోటపల్లికి పూర్వ వైభవం తీసుకొస్తాం

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి


తోటపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గరుగుబిల్లి, జూన్ 29 : ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి.. మొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు తోటపల్లి ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించారన్నారు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదని తెలిపారు. తోటపల్లి ఆలయాల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి అవసరమైన నిధులు సమీకరణకు కృషి చేస్తానని ఆమె వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, పార్టీ నేతలు ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.మధుసూదనరావు, రాంబాబు, డి.సత్యనారాయణ, భరత్‌కుమార్, వై.శ్రీనివాసరావు, డి.రామకృష్ణ, ఎం.శ్రీనివాసరావు, ఎ.కన్నయ్య, పకీరునాయుడు, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు డి.పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించడం అభినందనీయం

చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చొరవ చూపడం అభినందనీయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం తోటపల్లిలో ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ నిర్మాణం చేపట్టిన షెడ్ ట్రీ సిటింగ్ ప్రాంతాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధికి సేవా ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడంపై డాక్టర్ డి.పారినాయుడును అభినందించారు. దాతల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణతో పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ డి.ధనుంజయరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు, తోటపల్లి సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, అరకు తెలుగుదేశం పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, అక్కేన మధుసూదనరావు, మార్కొండ వాసుదేవరావు, మార్కొండ పకీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించండి

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మర్రాపు మహేష్ కోరారు. శనివారం ఆయన నాగూరు పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలను తెలుగు, ఇంగ్లీషు మీడియంలోనే కొనసాగించాలని కోరారు. 12వ పీఆర్‌సీ అమలు ఆలస్యమవుతుందని, మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అల్లు మహేశ్వరరావు, కార్యదర్శి ఐవీ రమణ, బి.మన్మథరావు, ఎం.రమేష్, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై పాలకవర్గ సభ్యుల ధ్వజం

● రసాభాసగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం


అధికారుల తీరును ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

సాలూరు: మున్సిపల్ అధికారుల తీరుపై పాలకవర్గ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు ఎజెండాను చదివి వినిపించారు. మున్సిపాల్టీలోని సాముహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలని అనేక సార్లు సమావేశంలో చర్చించినప్పటికీ ఆ విధంగా అధికారులు పని చేయకపోవటంతో నేడు ఆ సమస్య మంత్రి దృష్టికి వెళ్లిందని కౌన్సిలర్లు రాపాక మాధవరావు, గిరి రఘుతో పాటు పలువురు అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న 20వ నెంబర్ షాపు అద్దె సుమారు రూ.11లక్షలు రావాల్సి ఉండగా అధికారులు ఎందుకు వసూలు చేయటం లేదని, దీనిపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని కౌన్సిల్ సభ్యులతో పాటు వైస్ ఛైర్మన్ జర్జాపు దీప్తి హెచ్చరించారు. అస్సలు కమిషనర్ ఎవరో తెలియదు, ఎప్పుడు వస్తారో తెలియదు అలాంటప్పుడు సాధారణ నిధుల నుంచి కారుకు అద్దె చెల్లించటం సరికాదని కౌన్సిల్ సభ్యులు అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్‌గా ప్రజలను నుంచి గెలిచాం కానీ అస్సలు తల ఎత్తుకుని తిరగలేకపోతున్నామని, ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకుని వచ్చినా సమస్య పరిష్కారం కావటం లేదని 26వ వార్డు కౌన్సిలర్ సన్యాసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం ఒక్కో కుక్కకు సాధారణ నిధుల నుంచి రూ.1600 ఖర్చు చేయటం సరికాదని కౌన్సిలర్లు చెప్పగా, గతంలో కౌన్సిల్ సభ్యులే తీర్మానం చేశారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు సమాధానం ఇచ్చారు. వలంటీర్లకు జీతాలు అంతటా ఇచ్చారని మున్సిపాల్టీలో తక్షణం ఇవ్వాలని ఛైర్‌పర్సన్ వంగపండు అప్పలనాయుడు కోరారు. తాము ఏ సమస్య చెప్పినా అస్సలు పట్టించుకోవటం లేదని పలువురు ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, లైబ్రేరియన్ పోస్టులకు సంబంధించి గెస్టు బోధన ప్రాతిపదికన నియామక దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డా.సీహెచ్.చలపతిరావు శనివారం ప్రకటనలో తెలిపారు. జూలై 3లోగా కళాశాలకు దరఖాస్తులు అందజేయాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్‌ల అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

జాబ్‌మేళాలో 97 మంది ఎంపిక

సీతంపేట: ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 97 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. కేఎల్ గ్రూప్, అమెజాన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 147 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. వీరిలో 97 మంది ఇంటర్వ్యూల ద్వారా ఎంపికయ్యారని ఐటిడిఏ ఇన్‌చార్జి ఏపీవో వెంకట గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, వైటీసీ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: నగర పంచాయతీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆయన మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, పాలకొండ మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు పల్లా కొండలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రూరల్, అర్బన్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు కొంతమందికి అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో చేసిన భూకబ్జాలపై సమగ్ర విచారణ చేయాలని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నగర పంచాయతీ అధికారులు ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జయకృష్ణ ఆదేశించారు. లుంబూరు వద్ద జగనన్న కాలనీలో భారీ అవకతవకలు జరిగాయని, కాలనీపై జరిగిన మోసాలకు విచారణ జరిపించడం ఖాయమన్నారు. కాలనీలో వేసిన రహదారులకు గ్రావెల్ రోడ్డు రూ.60 లక్షలు ఖర్చు చేశామనడం సరికాదన్నారు. తాత్కాలిక పైపులైన్లకు రూ.80 లక్షలు ఖర్చుచేసినట్టు చెబుతున్నారని వాటిపై పూర్తిస్థాయిలో నిజాలు బయటకు తీసుకొస్తానని చెప్పారు. బాల్య వివాహాలు జరగకుండా ఐసీడీఎస్ సిబ్బంది అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలింతలకు, చిన్నారులకు పోషక ఆహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణాలకు స్థలాలను సేకరిద్దామన్నారు. నగర పంచాయతీలో చెత్త పేరుకుపోయిందని, క్లీన్ అండ్ గ్రీన్ నగర పంచాయతీగా ఉండడానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. పశువైద్యశాల, అగ్నిమాపక శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని తెలిపారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో కేసులు రిఫర్ కాకుండా వైద్యులు కృషి చేయాలన్నారు. తన వంతు ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.50వేలు ఎమ్మెల్యే ప్రకటించారు. విదేశాల్లో ఈ ప్రాంతానికి చెందిన వారు ఉంటే వారి నుంచి నిధులు వచ్చేలా కోరాలన్నారు. రెవెన్యూ శాఖలో దొంగ పట్టాలు ఇచ్చారని, వాటిని వెంటనే రద్దు చేయాలని ఆయన ఆదేశించారు. తప్పు చేసిన అధికారులు ఎక్కడకు వెళ్లిపోయినా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నగర పంచాయతీ కమిషనర్ వార్డుల్లో కలియదిరిగి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జయకృష్ణ సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు టంకాల దుర్గారావు, అడపా బాబ్జీనాయుడు, గర్భాన సత్తిబాబు, పెదబాబు, అధికారులు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి అగ్నిమాపక కేంద్రం సమస్యలు

పాలకొండ అగ్నిమాపక కేంద్రం పూర్తిగా శిథిలమైపోయిందని... పెచ్చులూడి పడిపోతున్నాయని.. భయం గుప్పెట్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించిన సమస్యలను వివరించారు. అగ్నిమాపక కేంద్రంలో కనీస సదుపాయాలు లేవన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే జయకృష్ణ సానుకూలంగా స్పందించి శాశ్వత భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయనకు హామి ఇచ్చారు.

అందుబాటులో మలేరియా ఇంజక్షన్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట: స్థానిక ఏరియా ఆసుపత్రితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'మలేరియా మందులు లేవు' అనే శీర్షికన ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందిస్తూ సీతంపేట ఏరియా ఆసుపత్రికి మూడు వేల మలేరియా ఇంజక్షన్లు శనివారం సరఫరా చేశారు. ఇకపై ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు సంబంధించి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానిక్, ఏడాది కోర్సులకు సంబంధించి వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్, డ్రెస్ మేకింగ్ ట్రేడుల్లో చేరాలనుకునే వారు దరఖాస్తులను జూలై 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోవాలని సూచించారు. అదే నెల 27న సీతంపేట ఐటీఈఐలో ఉదయం పది గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

అట్రాసిటీ కేసులు నమోదు చేయాలి

పార్వతీపురంటౌన్: అగ్ర కులాలవారు దళితులపై దాడి చేస్తుండడం అమానుషమని, వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామంలో ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న దళితులపై ఆ గ్రామానికి చెందిన పెత్తందారులు దాడులకు పాల్పడ్డారు. బాధితులను శనివారం సీఐటీయూ నాయకుడు రమణతో పాటు పలువురు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న భూమి తమదని పెత్తందారులు అనడం సరికాదన్నారు. దళితులపై దాడులకు దిగుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.